


సీత కళ్లకు చాలా ముద్దొచ్చింది చిట్టిపాప — ఆరిందాలాగా పావడా కట్టుకొని, మెడకింద గంధం రాసుకొని.

పొద్దున్నే అంత చక్కగా చిట్టిపాపను చూసినందుకు సంతోషపడింది సీత.

"మామయ్యగారు ఉయ్యాల వేసి పెడతానన్నారు" అంటూంది.

అది అట్లతదియ హడావిడి. ఎంత ఉత్సాహమో ఈ పిల్లలకు!

"నువ్వూ రా, అక్కా! నువ్వుకూడా ఊగచ్చంట" అంది మురిపెంగా చిట్టిపాప.

"ఏం మాటలు!" అంది సీత కోపంగా చెవి పట్టుకొని.

"నా కేం తెలుసమ్మా! మామయ్యగారే అన్నారు—మీ సీతక్కకూడా ఊగచ్చు. అంత పెద్ద ఉయ్యాల వేస్తానని." చిట్టిపాప అలిగింది.

'ఏం మనిషి! సంకోచం, బిడియం లేవేమిటి ఇతనికి? ఈ సారి వచ్చినప్పుడు చెప్పాలి గట్టిగా' అనుకొంది. అట్లా చాలాసార్లనుకొంది సీత. అతను వస్తాడు, వెళతాడు. కాని తను చెప్పలేదు. అసలంత నిస్సంకోచంగా, కల్మషం లేకుండా మాట్లాడే అతనితో ఎట్లా చెప్పడం? ఎవరు మాత్రం చెప్పగలరు? విచిత్రమైన మనిషి. అసలు రావు ఈ ఇంట్లో అడుగు పెట్టడమే గమ్మత్తు.

ఒక రోజు పెద్ద సైన్యాన్ని వెంటబెట్టుకొని దూకుడుగా వచ్చింది చిట్టిపాప.

ఆరుబయట పడుకొని వాలిపోతున్న పొద్దువంక చూస్తూన్న సీత ఉలిక్కిపడింది. కుదిపేస్తూంది చిట్టిపాప.

"ఓ సీతక్కా! నువ్వింత దొంగవనుకోలేదు."

"ఏమిటే? ఏమి టీ దూకుడు?" చేయి పట్టి కూర్చోబెడుతూ సముదాయించబోయింది సీత.

"మన తోటలో గోరింటాకు చెట్టుందని నా కెప్పుడైనా చెప్పావా? చూడు! వీళ్లందరికీ తెలుసట." దోషిని చూస్తూన్నట్లు చూసి చెయ్యి విదిలించేసింది చిట్టిపాప.

"ఉంది కాబోలు నా కేం గుర్తు చెప్పు? దాని కింత కోపమా?" నవ్వింది సీత.

"అయితే, పద."

"ఎక్కడికి?" సీత విస్తుబోయి చూసింది.

"నువ్వుకూడా కోసి పెట్టాలి. మా కందుతుందా ఏమిటి?" 'చెప్పనందు కిది శిక్ష' అన్నట్లుంది చిట్టిపాప ధోరణి. మళ్లీ తనే "ఉండు" అంటూ రివ్వున లోపలి కెళ్లొచ్చి, "మామ్మగారు తీసుకెళ్లమన్నారులే. పెద్దాళ్ళు లేకపోతే చెట్లలో మాకు భయం వెయ్యదూ!" అంది కుచ్చెళ్లు పట్టి లాగుతూ ఆ దూకుడు చూచి నవ్వొచ్చింది సీతకు. కాదన బుద్ధి కాలేదు. దాదాపుగా మరిచిపోయిన పనులన్నీ చిట్టిపాప మళ్ళ అలవాటు చేస్తూంది.

తీరా తోట లోపలి కెళ్లాక సీత ఉనికే మరిచిపోయారు పిల్లలు. సీతకూడా తన ధోరణిలో అంతా తిరుగుతూ చూస్తూంది తోటంతా తడుస్తూంటే కమ్మని వాసన తేలి వస్తూంది. ఎక్కడో చెట్లలో నుంచి గాలివిసురుకు పిల్లల అల్లరి. నవ్వులు వినిపిస్తున్నాయి. ఉల్లాసంగా ఉంది సీతకు.

కాలం కడుపులో ముత్యాల్లాంటి రోజులు ఎక్కడో దాక్కొని ఉంటాయేమో, వాటిని భద్రంగా ఏరి, తెచ్చి ఎవరు చేతి కిస్తారో ఏం తెలుసు?

నడుస్తూ ఒకసారి ఎందుకో సంశయిస్తూ ఆగిపోయింది సీత. ఏ వైపు నుంచో మందంగా ఎవరిదో పాట చెవులో పడుతూంది. ఎంతో హాయిగా ఉంది వినటానికి.

ఇదివరలో ఏతాంగా ఉపయోగించి పెద్ద గుంట ఉంది అక్కడ. ఇప్పుడు దానిలో నీళ్లు లేవు. అంగుళం సందు లేకుండా పిచ్చిమొక్కలు మాత్రం పెరిగి ఉన్నాయి. దాని చుట్టూ తవ్వి పోసి

మట్టేమో, ఎత్తుగా గట్టులాగా ఉంది. అప్రయత్నంగా ఆ గట్టుమీది కెక్కి ముందుకు చూసింది సీత. వాగు అవతల కొండ మొదట్లో ఎర్రబడుతున్న పడమటి పొద్దు కేసి చూస్తూ తన్మయంగా పాటలో మునిగిపోయి కనిపించాడొక వ్యక్తి.

'ఎవరో! ఎలాంటి అభిరుచి!'

విస్మయపడుతూంది సీత.

అలా ఎంతసేపునిలబడిందో! కళ్లలో ఎందుకో నీళ్లు నిండి అయోమయంగా అనిపించింది సీతకు. కాలు కొంచెం జారిందనుకొంది.

ఎండిన మట్టిపెళ్ల విరిగి, దానితో బాటు సీతకూడా కిందకు జారింది.

మళ్లీ కళ్లు తెరిచేసరికి మౌత్ ఆర్గన్ చేతో పట్టుకుని అతను!

ముఖంమీదకు వంగి, "అమ్మో! ఇంకా నయం. కొంచెం ఉంటే ఎక్కడ పడిపోయే దానివో" అంటూంది కళ్లింతవి చేస్తూ చిట్టిపాప.

'కింద పడిపోలేదా!' అనుకొంది అమాయికంగా సీత.

లేచి నిటారుగా నిలబడబోయింది. మోకాలు కలుక్కుమని ప్రాణం పోయే లాగ బాధ పెట్టింది. నిస్సహాయంగా మళ్లీ వెనక్కి వాలి పడుకొంది. 'ఇంట్లో కెళ్లటం ఎలా?' అని బెంగపడింది సీత.

దూరంగా చెట్లవెనక నుంచి ఇల్లు కనిపిస్తూనే ఉంది. అయినా వాళ్ళందరూ చిన్న పిల్లలే. తన బరువు ఓపలేరు.

"లేచి నిలుచోగలరా?" అన్నాడతను చొరవగా ముందుకొచ్చి.

సీతకుతలకొట్టేసినట్లయింది. 'మాలి కూడా ముందుకు రాడేం' అనుకొంది నిస్సహాయంగా.

వంగి చెయ్యి అందించాడు. 'ఏ నిస్సంకోచమో ఇతనికి!' ఆశ్చర్యపడింది సీత. అతను చెయ్యి పట్టుకొని నడిపిస్తుంటే ముళ్లమీద నడిచినట్టు బాధ పడింది. మరో వారం రోజులు అతని ఉనికి మందులాగా మింగింది. నొప్పితో విలవిల్లాడితే అతనే ఇంజక్షన్ చేసేవాడు. అప్పుడే చిట్టిపాపకు డాక్టర్ మామయ్య అయ్యాడు రావు. సీతకూడా అల్లాగే అనుకొంది.

ఒకరోజు అత్తగారు— "అతను డాక్టరు కాదర్రా" అంది తాపీగా.

"అయితే ఎవరేమిటి?"

"వి. ఎల్. డబ్ల్యు. గా వచ్చాట్ట!"

సీత నిరుత్సాహపడింది. అతను డాక్టరే అయి ఉండాలని అనుకోలేదు సీత. అంచనాలో అంత తేలిగ్గా బోల్తా పడినందుకు సిగ్గుపడింది. సీత లేచి నడిచేసరికి అతని రాక పూర్తిగా అలవాటై పోయింది.

అన్నింటినీ మించి సీత అత్తగారికి అతను ఆప్తుడై పోయాడు.

మొదట ఆమె ధోరణికి సీత చాలా ఆశ్చర్యపడేది.

"పాపం, ఒంటరిగాడట. ఏం తిన్నాడో, ఏం లేదో చూసేదెవరు?" అంటూ తన వంటకాలన్నింటికీ మంచి శ్రోతను చేసుకొంది.

* * *

చిట్టిపాప ఒక ట్రిప్ పూర్తి చేసుకొచ్చింది. బ్రష్ చేతో పట్టుకొని ఇంకా అల్లాగే కూర్చున్న సీతను చూసి, "ఎన్నిసార్లు కడుక్కుంటావ్ ముఖం!" అంది ఆశ్చర్యంగా.

"ఒక్కసారేగాని, నీ ముఖా నేమిటి అది?" మాట మార్చేసి చిట్టిపాప ముఖం దగ్గరకు తీసుకొని చూస్తూ అంది సీత.

పోయిన బాధంతా మళ్లీ ముఖంలో చూపెడుతూ, "ఉయ్యాలమీంచి పడిపోయానక్కా! మామయ్యగారు మందేశారు" అంది దీనంగా.

"ఈ ఉత్తుత్తి డాక్టరు దగ్గర మందులకేం తక్కువ లేదు" అంది సీత, టించర్ అయొడిన్‌తో తడిసిన దూది సున్నితంగా వత్తుతూ.

"అన్ని మందు లుంటే డాక్ట రెందుక్కాదు మామయ్యగారు?"

"మందులు వేరు, డాక్టరు వేరు. నీకు తెలీదులే" అంది సీత.

చిట్టిపాపకు అర్థంకాక ఊరుకొంది.

* * *

"క్షమించండి, మీ రింకా పాలిక లోనే నమకొంటాను?" ఆ రోజు ఉన్నట్టుండి అన్నాడు రావు.

అదిరిపడినట్లు ఒక్కసారి చూసి, మళ్లీ ఆటలో మునిగిపోయింది సీత.

"మీ రింతకుముందు, అంటే— అప్పుడు నాకు తెలియకొండి, ఈ మాత్రం ఉత్సాహంగా ఉండేవారు కాదను కొంటాను. మీరు మారుతున్నారా?"

"ఉత్సాహం అంటే?" సూటిగా చూసింది సీత. "ఇంత చిన్నప్పుడుకూడా ఆటల్లో పడి, టించర్ వేయించుకొన్న గుర్తు లేదు నాకు" అంది నవ్వేస్తూ.

"బాగుంది మీరు చెప్పేది! అయితే నాకు చిన్నప్పుడు ఒంటినిండా దెబ్బలే" అన్నాడు రావు. అని కొంచెం ఆగి, "మీలో మార్పొస్తున్నట్టుంది కాదా" అన్నాడు మళ్లీ మొదలెడుతూ.

ఆడటం మరిచిపోయి చేతిలో స్ట్రైకర్ తిప్పుతూ కూర్చుంది సీత.

కొంచెంసేపు చూసి, విసుగేసి, స్ట్రైకర్ లాగేసుకొంది చిట్టిపాప.

"మీ రేం అనుకోకండి, ఒక్క మాట. పెళ్లి చేసుకోకూడదూ మీరు?"

పెళ్లి! ఎవర్ని? ఎందుకు?

కనుబొమ్మల ముడిలో నుంచి అతన్ని అనుమానంగా చూసింది. తెల్లగా ఉండి మరింత తెల్లగా పాలిపోయిన సీత నుదుటి మీద చూపు నిలిపాడు రావు. ఆ చూపుల్లో ఏముందో గ్రహించడం కష్టం. అద్దాలలోనుంచి చూస్తున్నా తీక్షణంగానే ఉంటుంది చూపు. చూపు దించి, ఏదో వస్తువుని అపురూపంగా భద్రం చేస్తున్నట్టు ధ్యానంలో పడింది సీత.

"మీ రేం మాట్లాట్టం లేదు!"

"అవును, ఏం మాట్లాడాలి? మీ కేం తెలును?" అంది సీత తలెత్తకుండానే.

"ఓ! అంతా కాకపోయినా, కొంత తెలుసుకొంటాను. అయినా ఆలోచించండి. ఒకవేళ మీ కీ విషయం నచ్చకపోతే అనవసరంగా బుర్ర పాడు చేసుకోకండి" అన్నాడు రావు, చెప్పుల్లో కాళ్లు దూరుస్తూ. సీత అప్రయత్నంగా లేచి నిలబడింది.

"మీకు వీలైతే ఒకసారి మా తోటలో కలుద్దాం రేపు" అని ఓ సారి సీత వంక చూసి గేటువైపు వెళ్లిపోయాడు.

గేటు మూసి వెనక్కి వస్తూంటే ఎందుకో నీరసంగా అనిపించింది సీతకు. మెట్ల చివర, వరండాలో స్తంభానాను కొని కూర్చుంది. మబ్బులు కమ్మి చల్ల గాలి వేస్తూంది. అల్లాగే వెనక్కి తల ఆన్చి కళ్లు మూసుకుంది. మత్తుగా, సుఖంగా అనిపించింది.

* * *

ఎవరిదో మందలింపుకి తెలివి తెచ్చుకొని బలవంతంగా కళ్లు తెరిచింది సీత.

చిట్టిపాప తన జడలో ఖాళీ దొరికిన చోటల్లా జాజిమొగ్గలు గుచ్చుతూంది.


విస్మయపడి, జడ లాగేసుకొని పూలు తీసేయడం మొదలుపెట్టింది. అత్తగారు ఒక ప్లేటు నిండుగా ప్రసాదం తెచ్చి కింద పెట్టింది. సీతకు సందేహం వచ్చింది.

"ఈ వేళ. . ."

"శనివారం కదూ?"

ఇంద్రచాపపు ఏడురంగుల మురిపెం భ్రమ అని చాలా మందికి తెలియకపోవచ్చు. అయితే ఏం, భ్రమ తో అయినా అంత సౌందర్యం చూడగలగడంలో చాలా ప్రత్యేకత ఉంది. ఎప్పుడో ఒక్కసారి విరుస్తుంది. అది చాలా తక్కువ కాలం ఉంటుంది. ఆ కొద్దికాలం లోనే ఆ అందం అనుభవానికి రావడంలో సార్థకత లేదూ?

పద్మ



సంజవేళ    చిత్రం — వి. బాలరాజు (మద్రాసు-17)

ఆశ్చర్యపడింది సీత. క్షణం క్రితం ఆవరించిన హాయి ఏదో మాయం అయింది. అక్కడ నిలుచో బుద్ధి కాలేదు సీతకు.

క్రితం శనివారం అనుకొంది తను— 'వచ్చేవారం సరిగ్గా, రాజా పుట్టినరోజని.

'ఎందు కీమధ్య పరధ్యాస ఎక్కువయింది?' వేపచెట్టు తిన్నెమీద కూర్చుని విస్మయపడింది సీత.

చచ్చిపోయినవాళ్ల పుట్టిన రోజుకి విశేషం లేకపోవచ్చు. అయినా ఆ విషయం గుర్తుకూడా లేకుండా పోయినందుకు బాధపడింది సీత.

రాజాది ఒక్క పుట్టిన రోజే చూసింది సీత. మళ్లీ సంవత్సరానికి అతను లేడు. అతను లేకుండా, అది మూడో సంవత్సరం. ఆ రోజు— సీతకు బాగా గుర్తు ఇప్పటికీ—

చేతుల్లో పట్టేనన్ని గులాబీలు కోసుకెళ్లి రాజా దోసిట్లో పోసి "శుభాకాంక్షలు" అంది ప్రేమంతా కళ్లలో నింపి చూస్తూ.

రాజా ఒక్కసారి ఫక్కుమన్నాడు. "ఓ పిచ్చీ! పువ్వుల్లో అందం నాకేం తెలుస్తుంది? ఏ అదృష్టమో నువ్వూ, నీ అందం తెలుసు. అదేచాలు" అంటూ తిరిగి అవే పూలతో సీతను ముంచేసి ఉక్కిరిబిక్కిరి చేశాడు. అప్పుడు ఆ ఒక్క క్షణంలో తన దెంత అదృష్టం అని మురిసిపోయిన సీత ఆ రాత్రి స్నేహితుల్లో, మత్తులో తన ఉనికే గుర్తించని అతన్ని చూస్తూ ఏది నిజం అనుకోవాలో అర్థంకాక విస్తుపోయింది.

అతనిలో ఏ రెండు గుణాలకీ పొత్తు ఉండదు.

ఒక్కోరాత్రి— "ఇంత పెద్ద జడ నీ కెందుకు, సీతా! కత్తిరించేస్తాను" అంటూ కత్తెర కోసం వెతికే వ్యక్తి మర్నాడు పొద్దున్నే, సీత లేచేసరికి పూలన్నీ తెచ్చి, "మనతోటలో ఎన్నున్నా నీ జడకే చాలటం లేదు, సీతా" అంటూంటే ఏం చేయాలో తెలీక నవ్వుకొనేది సీత.

ఊరి బయట కొండనీడలో కూర్చుని, షాట్ గన్ పెట్టుకొని తన్మయత్వం అనుభవిస్తూ మరుక్షణంలోనే నీళ్ల కోసం వస్తూన్న పిట్టల్ని కాల్చి పడగొడుతుంటే విలవిల్లాడేది సీత.

సీతది, రాజాది పెళ్లి ఆదర్శంగానే జరిగింది. ఒక్కోసారి అతను మత్తులో పడి కొట్టుకొంటూంటే, తను బలిపశువుగా ఉపయోగపడిందేమోనని మథనపడేది. తరవాత ఎన్నోసార్లు మళ్లీ ఆ మాటే మరిచిపోయింది.

తన తుపాకి దెబ్బ తిన్న పిట్ట నీళ్లలో పడిందని, దాని కోసం తనూ దూకి గుండంలో పడి, ఆ స్వభావానికి తగ్గట్టే అంతర్ధానం అయిపోయాడు.

'ఆ కొద్ది జీవితంలోనే ఎన్ని రంగులు!' అనుకొంటూంది సీత.

'తన కిప్పుడు మళ్లీ కొత్త జీవితమేమిటి? ఏ పుణ్యం మూలాన్నో ఈమాత్రమైనా దక్కింది. తనకు దారి చూపటానికి తన లాంటిదే అత్తగా రుంది. ఆవిడ వెనక తను. ఉన్నన్ని రోజు లుండి ఎప్పుడో రాలిపోతారు. వెనకటి నుంచీ ఎంతమందో తమలాగే బ్రతికి వెళ్లిపోతున్నారు. వాళ్లలో తామూకూడా కలిసిపోతారు. వేరే ఏదో కావాలనుకోవటానికి తన ప్రత్యేకతేమిటి?'

మబ్బులు పోయి వెన్నెల బాగా వచ్చేసింది. వేపచెట్టు కొమ్మల్లోంచి జల్లెడ పట్టినట్లు పడుతూంది వెలుగు.

'చిన్నప్పుడు అమ్మ వేసిన ముగ్గుతో గొబ్బెమ్మలు పెట్టి, "మొగలిపువ్వంటి మొగుణ్ణియ్యవే" అని వచ్చీరాని మాటలతోనే పెళ్లి, భర్త అంటూ ఊహలు నేర్చుకొంది. తనేకాదు తోటి ఆడపిల్లలందరూ చెట్టుకూ పుట్టకూ పెళ్లికోసమే మొక్కుకొనేవారు. ఇప్పుడు పిల్లలు వేరు. చిట్టిపాప చేతులు కట్టుకొని ధీమాగా—'నేను మెడిసిన్ చదువుతాను' అంటుంది. చదువుతుందేమోకూడా. ఆ పిల్ల అలా నమ్మకంగా చెపుతూంటే ఎవరికీ అబద్ధం అనిపించదు. అన్ని మొక్కులూ మొక్కుకొంటే తనకేం ప్రయోజనం లేకపోయిందేం?'

మోకాలిమీద గడ్డం ఆన్చుకొని ఎవరిదో వేదన శ్రద్ధగా వింటున్నట్లు కూర్చుంది సీత, చూపు అనిర్వంతవరకూ. వెన్నెల్లో తడుస్తూ నిశ్చలంగా నిలబడి ఉన్నాయి చెట్లు. దూరంగా, నిశ్శబ్దంగా ఇళ్లు. ఇంకా అక్కడ కూర్చోవడానికి భయంవేసింది సీతకు.


కారవ్స్ నేర్చుకొంటున్నాడు. తెల్లగా, బొద్దుగా, 'కాన్వెంట్ కుర్రాడు' లాగా ఉన్నాడు. రావు తెల్లబోయి తమాయించుకొని వెనక్కొచ్చి కూర్చున్నాడు. రావుని అలా చూస్తూంటే గమ్మత్తుగా ఉంది. "ఈవేళే వచ్చాడు" అని చెపుతూ, 'ఇంక ఆ ప్రసక్తి ఎత్తడు బాబూ!' అనుకొంది నమ్మకంగా.

ఒక నిమిషం ఆగి, "మరి తోటలో కెళదాం రారూ" అన్నాడు రావు.

సీతకి కొంచెం ఆశ్చర్యం వేసింది. 'ఇంకా ఏమి టితని ఆశ?' అనుకొంది. 'అయినా ఫరవాలేదు. ఇప్పుడు అత నేం అడిగినా చెప్పొచ్చు.'

రెండడుగులు ముందుకేసి, "మేం తోటలో కెళుతున్నాం— మీరు రారా?" అంది పిల్లల్ని చూస్తూ.

"గేమ్ మధ్యలో ఉన్నాం— ఎలా రావటం?" అంది సీరియస్‌గా చిట్టిపాప.



'ఆర్నెల్ల సహవాసంతో వారు వీరయ్యే అదృష్టం తమకు పట్టలేదు కాని, అతన్నుంచి కొంత గడుసుతనం మాత్రం తనకూ అంటింది!'

మనిషి పోయినా, ఇంకా అతని నీడ తన మీద ఉంది. అందుకే తన నడవడిని ఆవారాలతో కట్టడి చేసేవారు లేకపోయారు.

రావు ఇట్లా అడుగుతాడని తనకు తెలుసు. ఆ స్వభావం బాగా పరిచయమే. మొదట కొండవాగు పక్కన అతన్ని చూసినప్పుడే ఎందుకో చలించింది, అర్థం కాకుండా.

అయినా, పెళ్లి మాటెత్తితే ఎందుకంత కలవరపడినట్లు తను?

'తనలో ప్రలోభం బయలుదేరటం లేదుకదా?' అనుకొంది భయంగా సీత.

ఈ ఇంట్లో అడుగు పెట్టి, చూసిన ఈ కొద్ది జీవితం తప్పించితే, అందరు బీదకన్యల్లాంటి మామూలు బ్రతుకే సీతది.

* * *

సాయంకాలం అవుతుండగా రావు వచ్చాడు. రావుకు నాలుగేళ్ల పిల్లవాణ్ణి చూపుతూ, "మా బాబు" అంది సీత. వెనక గదిలో కూర్చుని చిట్టిపాప దగ్గర

"మరే! గేమ్ ఆపేస్తే ఎట్లా? ఆడుకోండి" అని చెప్పి రావు వెనక నడిచింది సీత.

ఒత్తుగా గడ్డి ఉన్న చోటు చూసి కూర్చుని, "ఆలోచించారా, నే చెప్పిన విషయం?" అన్నాడు రావు.

చుట్టూ గడ్డి తెంపి నములుతూ, "ఏం ఆలోచించాలి" అంది సీత తేలిగ్గా.

"అదేనండీ— ఆ విషయమే."

"ఏ విషయం?"

"మీకు హాస్యంగా ఉందేమో? లేక నన్నో తుంటరివాడికింద కడుతున్నారా?" అన్నాడు రావు నిటారుగా కూర్చుని.

"లేదు, మీరు పెద్దవారే. చెప్పండి ఏం ఆలోచించాలి?"

"మీరు పెళ్లి చేసుకోవడానికి అభ్యంతరం ఏమిటి?"

"ఇంకేం చెప్పాలి మీకు? ఆ మాటకూ, నాకూ ఎంతో దూరం" అంది తప్పనిసరిగా సీత.

"దూరం దేముందిలెండి! మనం

అనుకోవడంలో ఉంది. మీ రలా అనుకోవ డానికి ఒక్క సరిఅయిన కారణం చెప్ప గలరా?"

"ఒక్కటేమిటి— చాలా ఉన్నాయి. ఎటొచ్చీ అవన్నీ సరిఅయినవే" అంది బింకంగా సీత. అతనితో వాదనకు దిగితే నెగ్గటం కష్టం అని తెలుసు.

"అయితే నేను చెపుతా నుండండి. మచ్చుకొకటి—'ఒకసారి పెళ్లైన స్త్రీ అంతా మరిచిపోయి మళ్లీ కొత్తగా వేరే జీవితం ఎట్లా అనుభవిస్తుంది' అని. అవునా?"

సీత ఆశ్చర్యపడింది.

"మనకు చాలా ప్రియమైన వ్యక్తి చచ్చిపోతే చాలా బాధ పడతాం. నిజమే. అసలది నిజం అని నమ్మటానికే చాలా కాలం పడుతుంది. కాలం గడుస్తుంటే ఎప్పుడో నమ్మక తప్పదు. తప్పనిసరిగా ఆ వ్యక్తిపట్ల విరక్తి ఏర్పరుచుకొంటాం. అసలు వాళ్ల ఉనికే ఇక్కడ లేదనుకొన్నాక మరిచిపోకపోతే చిక్కేమిటి?"

"బతికి ఉన్నప్పుడు మన కష్టం, సుఖం వాళ్లతోనే ఊహించుకొంటాం. విధివశాత్తు చచ్చిపోతే, వేరే సుఖం వెతుక్కోవటమా? అది స్వార్థం, సుఖాల మీద అపేక్ష కాదూ?" సూటిగా చూస్తూ అడిగింది సీత.

"పుట్టి పెరిగేలోపల ఇన్ని చావులు చూస్తున్నాం. వాటిల్లో తల్లి, తండ్రి, భర్త, భార్య, బిడ్డలు, స్నేహితులు —వీళ్లలో ఎందరో, కనీసం ఎవరో ఒకరు ఆ క్షణంలో వాళ్లు లేనిదే బ్రతకలేమను కొంటాం. చూడండి, అయినా ఎందుకు చచ్చిపోవటం లేదు? అట్లా అన్నీ చూస్తూ ఉంటూనే ఉన్నాం ఎందుకని? అసలు బతకాలనేదే కోరికైనప్పుడు, దానికి రక్షణ కల్పించుకోవడంలో మీరు చెప్పిన స్వార్థం ఉంటుందంటారా?"

వింటూ మౌనంగా కూర్చుంది సీత. ఏం చెప్పటానికీ తోచలేదు.

"రోజులు పోయినకొద్దీ మీ రీ మాత్రం నిశ్చింతగా, హాయిగా ఉండ గలరా? చిట్టిపాపా, మీ అత్తగారూ —వీళ్లు లేకుండా...మీరు ఊహించారా?"

'అవును. ఏ గాలి విసురుకో వచ్చి అందంగా కవ్వించింది చిట్టిపాప. వాళ్ల నాన్న ట్రాన్స్‌ఫర్‌తో మళ్లీ ఎటో వెళ్లి పోతుంది. తను కనీసం జన్మలో ఒక్కసారైనా చూడలేకపోవచ్చు.

అత్తగారికి వయసు మళ్లిపోతూంది. ఆవిడ పోయాక, ఇక ఈ రావులాంటి వ్యక్తుల ప్రసక్తే ఉండదు.

అప్పుడు— తన కోసం తను! అంతే.' రావు ఒక్కో మాటా చెపుతూంటే



గీతలలో నాతి చిత్రం—జె. కిరీటి (కాలెంపూడి)

ఏదో పీటముడి విడిపోతున్నట్టు సులువుగా అనిపిస్తూంది.

"మీరు పెద్ద ఉత్సాహంతో జీవితాన్ని చూడాలనుకొనేవారు. నా వంటి దానితో మీ కెందుకు తలనొప్పి!" తన సంశయాలు ఇంకా ఉన్నట్టు బయటపెట్టింది సీత.

"'అయితే, మీరు పెళ్లి చేసుకొంటే ఆ వ్యక్తి నేనే అనుకొంటున్నారా?"

'ఏం వరవడి! తన ఆలోచన తన నోటితోనే బయట పెట్టించాడు.'

"పప్పులో కాలేశారండీ" అన్నాడు తాపీగా వెనక్కు చేతు లాన్చి కూర్చుంటూ.

సీత తెల్లబోయి చూసింది.

"ఇప్పుడు చెప్పారు చూడండి, ఆ భాష్యంలో నేనుకూడా మీ లాటివాణ్నే. అయితే, నేను ఉత్సాహంగానే ఉన్నాను. అదే తేడా! అయినా, వీటిని చూడండి. మోజు పడకుండా ఉండగలరా?" అంటూ చేతి కందినన్ని బంతిపూలు తెంపి కొన్ని సీత వైపు విసిరాడు.

'అవును. ఆడపిల్లకు ఎప్పుడు మాత్రం వాటిమీద మోజు పోతుంది! కాని, నన్ను చేసుకోవడం అంటే మరో మెట్టు దాటాలేమో, మరి కులాలు వేరుకదూ?

కొంచెం నవ్వొస్తినా ఆపుకొని, ఆదర్శంలోకూడా మెట్లా, తరగతులూ ఏమిటి?' అనుకొంది సీత.

చిట్టిపాప తన కొత్త స్నేహితుడి చేయి పట్టుకొని జాగ్రత్తగా తీసు కొస్తూంది.

"'వాడు మా బాబు' అని పరిచయం చేశారుకదూ? ఇప్పుడు మన బాబు అనండి, సంతోషిస్తాను" అన్నాడు రావు.

కళ్లజోడు తీసి, కర్చీఫ్‌తో తుడిచి మళ్లీ పెట్టుకొన్నాడు. బాబు పరుగెత్తు కొచ్చి రావు మెడ చుట్టూ చేతులేసి, "డాడీ! ఆ అమ్మాయి మంచిదేం కాదు. నన్ను ఓడించేసింది" అంటున్నాడు గారంగా.

"పేరు రవి. పక్క ఊరిలో చదువు తున్నాడు. ఆదివారం కదూ? తీసు కొచ్చాను."

రావు అంటూంటే అంతా అర్థం అయి సీత ముఖం ఎర్రబడింది.

'ఛీ! ఎంత తెలివిలేని పని చేసింది! కనీసం చిట్టిపాపను అడిగి ఉండవలసింది— ఈ బాబెవరని. ఇప్పటికే అతనికి అర్థ మయి ఉంటుంది. ఏం చెప్పీ ప్రయోజనం లేదు.

ఏ ఆశా తనకు లేకపోతే ముఖాముఖీ అతనికి కాదని చెప్పి ఉండవలసింది. గోడమీది పిల్లి వాటులాగా ఈ కుంటి సాకు లెందుకు చెప్పటం?

"ఇంకా మీ అభ్యంతరం ఏమిటి?" అన్నాడు రావు లేచి నిలబడుతూ.

అతని వైపు చూడాలనిపించలేదు తనకు.

"మీరు కూర్చోండి. స్తిమితపడిన తరవాత ఇంట్లో కెళ్లండి, నేను వెళతాను."

ఉన్నంతసేపూ ఉక్కిరి బిక్కిరి చేశాడు. అతను వెళ్లాక ఊపిరాడింది సీతకు. విశ్రాంతిగా మోకాళ్ల మీద తల ఉంచు కొని కూర్చుంది.

మనసు చల్లబడేట్టు సన్నగా వానజల్లు పడి వెలిసిపోయింది. తూర్పున అందంగా ఇంద్రధనుస్సు కనిపిస్తూంటే చూస్తూ ఉండిపోయింది సీత.

'ఏం రంగులు!' విస్మయపడింది.

ఆ ఏడురంగుల మెరిసెం భ్రమ అని చాలామందికి తెలియకపోవచ్చు. అయితే ఏం? భ్రమతో అయినా అంత సౌందర్యం చూడగలగటంలో చాలా విశేషం ఉంది. ఎప్పుడో ఒక్కసారి మెరుస్తుంది. అదీ చాలా తక్కువ కాలం ఉంటుంది. ఆ కొద్ది కాలంలోనే ఆ అందం అనుభవానికి రావటంలో సార్థకత లేదూ?

'ఇది— ఈ ఆకర్షణ ఎంత సహజం! దీన్నుంచి తప్పించుకోవటం ఎందుకు?' అనిపించింది సీతకు.

ఇంద్రచాపం మాయమైపోయి తూర్పు క్రమంగా నల్లబడుతూంటే, బెంగపడింది సీత. చీకటి పడిపోతూంది.

రంగులు లేనప్పటి వెలితి సీతకు బాగా తెలుసు. ఇంట్లోకి వెళ్లటానికి సంకోచం అనిపించింది. లేచి చుట్టూ చూస్తే పిల్లలిద్దరూ లేరు. ఎప్పు డెళ్లిపోయారో!

గోపలికి వెళుతూ విడిపోయిన బంతిపూవురేకులు చూసి, 'ఇంట్లోకి వచ్చే వెళ్లాడు కాబోలు' అనుకొంది సంశయిస్తూ. ఎక్కడా వెలుతు రున్న జాడ లేదు. తులసికోటలో దీపం వెలగ వలసిన సమయం. చిట్టిపాప ప్రసాదం కోసం గెంతుకుంటూ వచ్చి, దీపంలేని గూడు చూసి బిత్తరపోయి ఆగిపోయింది. చెట్ల క్రీనీడలో పూలసజ్జ పక్కన పెట్టు కొని ఏదో మరిచిపోయిన దానిలా కూర్చుని కనిపించింది సీతకు అత్తగారు. చిన్నగా వేళ్లు తగిలితే, ఉలికిపడిన ఆమెను చూస్తే జాలేసింది సీతకు. వంగి కాళ్లు అంటు కొని లేచేసరికి కళ్లనిండా నీళ్లూరాయి.

మెల్లగా తులసిచెట్టు దగ్గరకు నడిచి చిట్టిపాప చేతిలో కుంకుమభరిణ ఉంచి, "అక్కకు బొట్టు" అని చిన్నగా నవ్వి తన గదిలో కెళ్లిపోయింది. అదే దేవుడి గదికూడా. భర్తకూ, దేవుడికీ తేడా ఆమె కెప్పుడూ తెలీదు.

అర్థంకాక చూస్తున్న చిట్టిపాప బుగ్గల్ని ముద్దులతో నింపింది సీత. ★